రోడ్లపైనే నిరీక్షణ



ఇచ్చోడలో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

- బురదమయంగా ఇచ్చోడ బస్టాండ్
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

ఇచ్చోడ: ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. వర్షం వస్తే కనీసం తలదాచుకునేందుకు స్థలం లేకపోవడంతో వర్షంలో తడుస్తూ.. రోడ్డుపైనే నిలుచుంటున్నారు. బస్టాండ్ ఉన్న వర్షం కారణంగా బురదమయం కావడంతో బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లని పరిస్థితి. ఆదిలాబాద్, నిర్మల్ వైపు నుంచి రాకపోకలు సాగించే బస్సులు రోడ్డుపైనే తిప్పుకోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇంత జరుగుతున్నా.. ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

నిరుపయోగంగా బస్టాండ్..

గత నెల రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆర్టీసీ బస్టాండ్ బురదమయంగా మారింది. దీంతో బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. బస్టాండ్ ఆవరణలో బస్సులు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు శాపంగా మారింది. దాదాపుగా నెల రోజుల నుంచి ఆర్టీసీ బసాండ్ నిరుపయోగంగా మారింది.

కనీస వసతులు కరువు..

నిత్యం వేల మంది ప్రయాణికులు ఇచ్చోడ మీదుగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గత కొన్ని రోజుల నుంచి రోడ్డుపై బస్టాండ్ నిర్వహించడంతో మహిళ, వృద్ధ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కూర్చోవడం దేవుడేరుగు నిల్చోవడానికి కూడా స్థలం లేదు. ఎండకు ఎండుతూ.. వర్షంలో తడుస్తూ.. బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఇక అత్యవసరంగా మహిళ ప్రయాణికులు మల, మూత్ర విసర్జన కోసం నానా అవస్థలు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన డబుల్ రోడ్డు పనుల కారణంగా ఆర్టీసీ బస్సులను మండల కేంద్రంలోకి రావడం లేదు. బస్టాండ్ నుంచి బైపాస్ మీదుగా నడుపుతున్నారు. రోడ్డు పనులు పూర్తయిన బస్సుల రాకపోకలను పునరుద్ధరించ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికులకు వసతులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలు సాగించాలి



మండల కేంద్రంలో నుంచి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలి. బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ దిశగా ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకోవాలి. – మాజీద్, స్థానిక చిరువ్యాపారి

మరమ్మతులు చేపట్టాలి



ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి. బస్టాండ్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లను బాగు చేయించాలి. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. – పెరమండ్ల స్వామి, సామాజిక కార్యకర్త

ప్రయాణికులకు ఇబ్బంది



మండల కేంద్రంలో నుంచి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నిర్మల్ వైపు నుంచి వచ్చే ప్రయాణికులు నిర్మల్ బైపాస్ వద్ద, అంబేడ్కర్ చౌక్, శివాజీ చౌక్‌ల వద్ద బస్సు దిగాలి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. – కఠారి కృష్ణ, ఇచ్చోడ

క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

నార్నూర్: వర్షకాలం గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్యం, క్లోరినేషన్ సమస్యలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆదివారం 'సాక్షి' దినపత్రికల్లో 'పేరుకుపోయిన చెత్తాచెదారం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శి లవ్‌కుమార్‌ను అధికారులు ఆదేశించారు. దీంతో సిబ్బందితో గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. వర్షాకాలం ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రమేశ్ ఆదేశించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఆడే గజేందర్

నేరడిగొండ: గుడిహత్నూర్ మండలం కొల్హారి గ్రామస్తులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు బాలాజీ పటేల్, మాజీ ఎంపీటీసీ అంకాతి రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆడే గజేందర్ సమక్షంలో చేరగా.. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజాపాలనలో కొత్తరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతులకు రుణమాఫీ ఇస్తుందన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంత్ రావు, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, స్వామి, బద్దం పోతారెడ్డి, హీరాసింగ్, మౌలానా, ఎండీ సద్దాం, తీగల విలాస్ పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్యకర్తలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. రైతులకు కావాల్సిన యూరియా అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. జిల్లాలో తీవ్రమైన యూరియా కొరత ఉన్నప్పటికీ మంత్రులు, కాంగ్రెస్ నాయకులు యూరియా కొరతపై స్పందించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గాడ్గే సుభాష్, పాండురంగ్, నర్వడే రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

150 మందికి బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో 150 మంది కరాటే క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. కరాటే సీనియర్ మాస్టర్ కాంబ్లే ముకేశ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టెస్టింగ్ పరీక్షలు ఉత్సాహంగా సాగాయి. పరిశీలకులుగా ఆకాష్, రాము, సచిన్ వ్యవహరించారు. ఇటీవల ముఖేష్ కుమార్ బ్లాక్ బెల్ట్ ఎనిమిదవ డాన్ తీసుకున్నందుకు పలువురు మాస్టర్లు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు సంధ్య, రాహుల్, సునీత, అనుష్క, ప్రీతి పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ



ముఖర(బి)లో క్యూలో నిలుచున్న రైతులు

ఇచ్చోడ: మండలంలోని ముఖర(బి) ప్రాథమిక సహకార సంఘం వద్ద ఆదివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం 6 గంటల నుంచి రైతులు క్యూలో నిలుచున్నారు. యూరియా బస్తాతో పాటు అదనంగా నానో యూరియాను అంటగట్టడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి రైతులకు యూరియా సరఫరా చేసేలా చూశారు. ఆందోళనలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



గ్రామస్తులకు వివరిస్తున్న నాయకులు

జైనథ్: కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లను పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని సోమవారం అన్ని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని మాదిగ విద్యార్థుల సమైక్య సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సందె కార్తీక్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎస్సీకాలనీలో ఆదివారం కాలనీవాసులతో సమావేశమయ్యారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరేల్లి మల్లేశ్, కాలెపల్లి ప్రేమ్‌రాజ్, స్వామి, అల్లకొండ రవి, ఆశన్న, నరేశ్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జైనథ్: అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని మండల కిషన్‌మోర్చా అధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అదే విధంగా నెల రోజులు గడుస్తున్నా.. కూడా రైతులను పట్టించుకోవడం లేదన్నారు. రైతులను ఆదుకోకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, మంత్రులను గ్రామాల్లో తిరుగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు సీడం రాకేశ్, వచ్చన్న, అశోక్, సూర్యరెడ్డి, తరుణ్, అశోక్ పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న ఉయిక లక్ష్మణ్

గుడిహత్నూర్: లంబాడాలను జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ.. మాన్కాపూర్, ఉమ్రి (బి) రాయిసెంటర్ల ఆదివాసీలు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మాన్కాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా చట్ట విరుద్ధంగా ఎస్టీలుగా కొనసాగుతూ ఆదివాసీలకు అందే ప్రభుత్వ ఫలాలను అనుభవిస్తున్న లంబాడాలకు ఎస్టీ ధ్రువపత్రాలు జారీ చేయవద్దన్నారు. సోమవారం భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో మాన్కాపూర్, ఉమ్రి (బి) రాయిసెంటర్ల సార్‌మేడీలు పెందూర్ జైరాం, కాత్లే భరత్, కోవ భగవాన్, ఉయిక లక్ష్మణ్, కోవ జల్పత్, తొడసం మహేశ్, రాము పటేల్, అడ సంతోష్ పాల్గొన్నారు.

కార్యాలయ పనులు ప్రారంభం



దస్త్రాలను తొలగిస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్‌లోకి మార్చనున్నారు. ఇందుకోసం అక్కడి పాత జీపీఎఫ్ విభాగంలోని గదులను కేటాయించారు. దీంతో ఆయా గదుల్లో ఉన్నటువంటి రికార్డులు, సామగ్రిని తరలిస్తున్నారు. కార్యాలయ నిర్వహణకు అనుగుణంగా గదులను సిద్ధం చేసే పనులు కొనసాగిస్తున్నారు. ఈ ప్రక్రియను ఆర్‌ఐ యజువేందర్ రెడ్డి పర్యవేక్షించారు. కాగా డీసీసీఎస్‌ఓ, ఆర్డీవో కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భవనాలను ఆదివారం కూడా పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఏవో వర్ణతో కలిసి పెన్‌గంగా భవన్, ఓల్డ్ మున్సిపల్ కార్యాలయాలను పరిశీలించారు.

వంతెన నిర్మాణానికి కృషి



మాట్లాడుతున్న ఆడే గజేందర్

బజార్‌హత్నూర్: మండలంలోని మోర్కండి గ్రామం సమీపంలోని కడెం వాగుపై లోలెవల్ వంతెనతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, త్వరలోనే వంతెన నిర్మిస్తామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మోర్కండి రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా జిల్లా గ్రంథాలయం చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన మల్లేపూల నర్సయ్యను సన్మానించారు. కార్యక్రమంలో జల్కే పాండురంగ్, ఇర్ల శివుడు, పోరెడ్డి నారాయణ, నందుకుమార్, దినేష్, జగదీష్, విఠల్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో దున్నపోతు మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బూర్నూర్ గ్రామానికి చెందిన కుశల్‌రావ్ దున్నపోతు ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ప్రతీరోజు మాదిరిగానే ఆదివారం గేదేలతో పాటు మేతకు వెళ్లింది. యాపల్‌గూడ గ్రామం నుంచి బూర్నూర్ గ్రామానికి 11 కేవీ విద్యుత్ సరఫరా అవుతుంది. వ్యవసాయ పొలంలోని విద్యుత్ స్తంభంపై ఇన్సులేటర్ లేకపోవడంతో విద్యుత్ సరఫరా జరిగింది. మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన దున్నపోతు విలువ రూ. 70వేల వరకు ఉంటుందని పశుపోషకుడు వాపోయాడు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ కేంద్రం మంజూరు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేంద్రం మంజూరైందని ప్రిన్సిపాల్ టి. ప్రతాప్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్య సంవత్సరం నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సుల అడ్మిషన్ల గడువు సెప్టెంబర్ 26 వరకు పొడిగించినట్లు తెలిపారు. వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

నేడు ఇంజినీర్స్‌డే వేడుకలు



మాట్లాడుతున్న అన్నదానం జగదీశ్వర్

ఆదిలాబాద్‌టౌన్: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం ఇంజినీరింగ్ డేను నిర్వహిస్తున్నట్లు ఆర్కిటెక్స్, ఇంజనీర్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నదానం జగదీశ్వర్ తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ తరంగిణి హాల్‌లో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. వివిధ నిపుణులు తయారు చేసిన ప్రదర్శనలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాజు, షబ్బీర్ అలీ, శ్రీనివాస్, హీరాలాల్, అర్షద్ అలీ, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న డీసీపీవో కౌన్సిలర్ పద్మ

ఆదిలాబాద్‌టౌన్: బాల్య వివాహాలతో అనర్థాలు జరుగుతాయని డీసీపీవో కౌన్సిలర్ పద్మ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలో షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో చర్చిల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఆడపిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఉంటాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో న్యూలైఫ్ ఫెలోషిప్ చర్చి పాస్టర్ జయంత్ కుమార్, వినోద్, సంపత్, కిరణ్, సౌజన్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న అజయ్‌పవార్

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాలో కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పీఆర్టీయూ జిల్లా సర్వసభ్య సమావేశానికి వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డికి జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు అజయ్‌పవార్ వినతిపత్రం అందజేశారు. జీవో 317 కారణంగా ఇతర జిల్లాకు వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి ఆదిలాబాద్ జిల్లాకు రప్పించాలని, ఐటీడీలో పనిచేస్తున్న సీఆర్టీలకు ఐదు నెలల నుంచి వేతనాలు రావడం లేదన్నారు.

నూతన కలెక్టరేట్ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌజింగ్‌బోర్డులో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థతతోనే పనుల్లో జాప్యమైందని, వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.55 కోట్ల నిధులతో కలెక్టరేట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత కలెక్టరేట్ భవనం కూలితే బీఆర్‌ఎస్ నాయకులు హెల్మెట్ ధరించి నిరసన తెలిపారని గుర్తుచేశారు. వారిపై అక్రమ కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు అజయ్, మెట్టు ప్రహ్లాద్, యూనుస్ అక్బాని, సాజిదొద్దిన్, నారాయణ, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం



మాట్లాడుతున్న ఏఎస్‌సీడీవో నర్సింగ్



మాట్లాడుతున్న హాస్టల్ వార్డెన్ సురేందర్

నార్నూర్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం మరమ్మతుల కోసం కలెక్టర్ రాజర్షి షా రూ. 10 లక్షలు మంజూరు చేయడం జరిగిందని ఏఎస్‌సీడీవో నర్సింగ్ అన్నారు. ఆదివారం వసతి గృహంలో పోషకుల సమావేశం నిర్వహించారు. వసతి గృహం సమస్యలు, విద్యార్థుల విద్యాబోధనపై విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. తల్లిదండ్రుల అమూల్యమైన సలహాలు సూచనలు పరిగణలోకి తీసుకొని భవిష్యత్‌లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వసతిగృహం వార్డెన్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని తాంసి ఎస్సీ హాస్టల్ వార్డెన్ సురేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రలోని హాస్టల్ ఆవరణలో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను వివరించారు. సమస్యలు పరిష్కరించే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో సిబ్బంది సాయినాథ్, ట్యూటర్‌లు రాఘవేంద్ర, సంతోశ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాత్నాల: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని హాస్టల్ వార్డెన్ దత్తు అన్నారు. ఆదివారం భోరజ్ మండలం గిమ్మ గ్రామంలోని ఎస్సీ హాస్టల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, స్టడీ మెటీరియల్ అందిస్తున్నామన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్సీ వసతి గృహం వెల్ఫేర్ అధికారి రవీందర్ సమావేశం నిర్వహించారు. వసతి గృహం సౌకర్యాలు, సమస్యలు, విద్యార్థుల చదువు, ప్రతిభ, ఆరోగ్య సమస్యల గురించి చర్చించారు. వసతి గృహంలో ఎలాంటి సమస్య ఉన్నా.. తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాకెర గ్రామ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

బోథ్: సొనాల మండలంలోని సాకెర గ్రామం అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. రానున్న రోజుల్లో గ్రామం అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు తాటిపెల్లి రాజు, బోరే రవీందర్, రమణ, కనపర్తి చంద్రకాంత్, మీట్‌కరే రాజేశ్వర్, జుగాది రావు, మహిపాల్, శంకర్, నారాయణ, వెంకటేశ్, కసల్‌చంద్, రాజేశ్వర్ రెడ్డి, సుభాష్, శేఖర్, పోతన్న పాల్గొన్నారు.

ఎంపీ నగేశ్ పరామర్శ

నేరడిగొండ: మండలంలోని గుత్పాల గ్రామానికి చెందిన దుర్వ వాగుపటేల్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ ఆదివారం వారి నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మడావి గంగాధర్ అనారోగ్యంతో బాధపడుతున్నారన్న విషయాన్ని తెలుసుకొని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

తాగునీటి కష్టాలు తీర్చండి



చేతిపంపు వద్ద బారులు తీరిన గ్రామస్తులు

భీంపూర్: మండలంలోని గొల్లఘాట్ గ్రామంలో వర్షాకాలంలో సైతం తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో ఉన్న బోర్లు చెడిపోవడంతో నీటి సరఫరా ఆగిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సైతం రావడంలేదని వాపోతున్నారు. గ్రామస్తులు చేసేదేమీ లేక ఊరి చివరన ఉన్న చేతిపంపు వద్ద తాగునీటి కోసం బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

బెంచీల విరాళం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం స్టడీ సెంటర్ కోసం ఉపాధ్యాయుడు బొల్లం రమేశ్ స్టీల్ బెంచీలను ఆదివారం విరాళంగా అందజేశారు. స్టడీ సెంటర్‌లో డిగ్రీ, పీజీ ప్రవేశాలు పెరిగిన నేపథ్యంలో వీటిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, లెక్చరర్లు సంతోష్ కుమార్, రమేశ్, అనిల్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల సమీపంలో ఆదివారం విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపించారు.

నారాయణ సేవలు మరువలేనివి

భీంపూర్: సీపీఐ దివంగత పెద్ది నారాయణ చేసిన సేవలు మరువలేనివని సీపీఐ స్టేట్ కౌన్సిల్ మెంబర్ విలాస్ అన్నారు. మండలంలోని ధన్నూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన పెద్ది నారాయణ సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమించిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, రవి, దేవిదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన దాసరి ప్రశాంత్ ఇటీవల మరణించడంతో ఆ కుటుంబానికి మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పరామర్శించి, రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. మాల సంక్షేమ సంఘం నాయకులు భూమన్న, గజానంద్, ప్రకాష్, బుచ్చన్న, నరసింహులు, భూమన్న, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయి ఎద్దు మృతి

నేరడిగొండ: మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. తేజాపూర్ గ్రామానికి చెందిన బడాల శ్రీకాంత్ రెడ్డికి చెందిన ఎద్దు వరద ధాటికి కొట్టుకుపోయింది. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించగా ఎద్దు కొట్టుకుపోయింది. ఎద్దు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

రైల్వే స్టేషన్లో అన్నదానం

ఆదిలాబాద్: మానవసేవే మాధవసేవ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు చిందం దేవిదాస్, శ్రావణ్ నాయక్, కనక నర్సింగ్, రాకేశ్‌రెడ్డి, సాయిరాం, అశోక్, సునీల్ పాల్గొన్నారు.